క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


నాగరాజుగౌడ్

లింగాపూర్: లింగాపూ ర్ తహసీల్దార్‌గా బి. నాగరాజుగౌడ్ శనివా రం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించిన ఉదయ్‌కుమార్ గతనెలలో బదిలీపై వెళ్లారు. కాగజ్‌నగర్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగరాజుగౌడ్ ఇక్కడకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

‘ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి’

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ ఉద్యమ కారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వ రాష్ట్ర కార్యదర్శికి శనివారం ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం అందించినట్లు ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. మలిదశ ఉద్యమంలో ఉద్యమకారులు జైలుకు వెళ్లి అనేక రకాలుగా నష్టపోయారని, వారిని ఆదుకోవాలని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున ఉద్యమకారులను ఘనంగా సన్మానించాలని కోరినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ


బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న పోలీసులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఎస్సై లక్ష్మణ్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనదారుల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారికి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ వాహనపత్రాలతో నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

పెన్షనర్స్‌కు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పెన్షనర్స్‌కు బ్యాంకుల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ విశ్రాంత ఉద్యోగుల సంఘం కాగజ్‌నగర్ యూనిట్ సభ్యులు శనివారం స్టేట్ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన స్టేట్ బ్యాంక్ మేనేజర్ సతీశ్ కుమార్ జూన్ 2 నుంచి పెన్షనర్స్‌కు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు పేర్కొన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శి జయదేవ్, అబ్రహం, శివప్రసాద్, నర్సయ్య, షేక్‌మహబూబ్ సునీల్, సుభాష్, అన్వర్, అహ్మద్, కిషన్, విస్తారు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ


పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

కౌటాల: కౌటాల విద్యావనరుల కేంద్రంలో శనివారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో గావుడే హన్మంతు పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలను పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు అందజేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు ఉచితంగా మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు అందజేస్తామని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జయరాజు, సాయినాథ్, తిరుపతి, సునీల్, సిబ్బంది లాలాజీ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

‘జొన్న కొనుగోళ్ల గడువు పెంచాలి’

నార్నూర్: ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న జొన్న కొనుగోలు గడువును మరో పది రోజులు పెంచాలని మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తొడసం నాగోరావు అధికారులను కోరారు. శనివారం మండలంలోని మాన్కాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 31తో జొన్న కొనుగోలు గడువు ముగియడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. భారీ వర్షాలతో రైతులు జొన్న పంట తీయలేకపోయారని, రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని గడువు పెంచాలని కోరారు.

అద్దె భవనాల్లో అవస్థలు

- గురుకుల పాఠశాలకు పక్కా భవనాలు కరువు
- తరగతులకు, డార్మిటరీకి గదుల కొరత
- ఏటా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య



మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల పాఠశాల

రెబ్బెన: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసింది. వీటి ఏర్పాటు కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలను మొదట్లో కేటాయించారు. అరకొర గదులు, వసతుల నడుమ విద్యాబోధన ప్రారంభించారు. ఉన్న వసతులతోనే విద్యార్థులు సర్దుకుంటూ చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. అయితే ప్రభుత్వం గురుకుల పాఠశాలలకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడం లేదు. మూడేళ్ల క్రితం గురుకుల పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. విద్యార్థులు నూటికినూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తుండటంతో పాటు కళాశాలలుగా అప్‌గ్రేడ్ కావడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరిగింది. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు కల్పించడం పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

అద్దె భవనాల్లోనూ తిప్పలు..

మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ భవనంలో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రస్తుతం 640 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉండగా ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్య అందుబాటులో ఉంది. పాఠశాల విద్యార్థులతో పాటు కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తుండటంతో ప్రతీ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలో తరగతి గదులు, డార్మిటరీ గదులు అందుబాటులో లేవు. పాఠశాల కోసం కేటాయించిన పాత భవనంలో 20 గదులు ఉండగా వాటిలో ప్రిన్సిపాల్ గది, స్టాఫ్‌రూం, ఆఫీస్, బియ్యం, ఇతర సామగ్రి నిల్వ కోసం స్టోర్ రూం తదితర అవసరాలకు కేటాయించారు. అయితే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరగడంతో గదులు సరిపోక మరో రెండు భవనాలను అద్దెకు తీసుకున్నారు. ఒక భవనంలో 6 గదులను ల్యాబ్‌ల కోసం వినియోగిస్తుండగా మరో భవనంలోని 5 గదులను తరగతి, డార్మిటరీ కోసం వినియోగిస్తున్నారు. అయితే తరగతి గదులు, డార్మిటరీ కోసం ప్రత్యేకంగా గదులు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

నేలపైనే చదువు, నిద్ర..

గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే కూర్చుని చదువుకోవడంతో పాటు రాత్రి అదే గదిలో నేలపైనే నిద్రించాల్సిన పరిస్థితి ఉంది. తరగతి గదులు, డార్మిటరీ కోసం ప్రత్యేకంగా గదులు ఉన్న పాఠశాల, కళాశాలల్లో ప్రభుత్వం తరగతి గది కోసం డెస్క్ బెంచీలు, డార్మిటరీ కోసం డబుల్ కాట్ బెడ్స్ అందించింది. రెబ్బెన గురుకుల పాఠశాలలో గదుల కొరత కారణంగా తరగతి, డార్మిటరీల కోసం ప్రత్యేకంగా గదులు లేకుండా పోయాయి. దాంతో డెస్క్ బెంచీలు, డబుల్‌కాట్ బెడ్స్‌ను ఏర్పాటు చేసే అవకాశం లేకపోవడంతో విద్యార్థులు పగలు నేలపైనే కూర్చుని చదువుకోవడం, రాత్రి అదే గదిలో నేలపైనే నిద్రించాల్సి వస్తోంది. పాఠశాల కోసం రెండు సంవత్సరాల క్రితం ఒక భవనాన్ని, గత సంవత్సరం జూలైలో మరో భవనాన్ని అద్దెకు తీసుకోగా గత సంవత్సరం తీసుకున్న భవనానికి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు అద్దె అందలేదు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

తరగతి గదులు, డార్మెటరీలకు ప్రత్యేకంగా గదులు లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే కూర్చుని చదువుకోవాల్సి వస్తోంది. రాత్రిపూట కూడ నేలపైనే పడుకుంటున్నారు. గదుల కొరతతో రెండు భవనాలను అద్దెకు తీసుకున్నప్పటికీ ప్రత్యేకంగా తరగతి గదులు, డార్మిటరీల ఏర్పాటు ఇబ్బందిగానే ఉంది. విద్యార్థులు నేలపై కూర్చుని చదువుకోకుండా స్టడీ చైర్స్ అందించాలని ఉన్నతాధికారులను కోరాం.

– రజనీ, ప్రిన్సిపాల్

గుంతలకు మరమ్మతులేవి..?



దహెగాం: మండల కేంద్రం నుంచి లగ్గాం మీదుగా పెంచికల్‌పేట్, మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. అధ్వానంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడినప్పుడు గుంతలలో వర్షపు నీరు నిలిచి ఉండడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం రూ.కోట్లు వెచ్చించి వేసిన తారురోడ్డు గుంతల మయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. నాలుగు కిలోమీటర్ల ప్రయాణానికి సుమారు 15 నిమిషాల సమయం పడుతుందని పేర్కొంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా ఈస్‌గాం శివాలయం వార్షికోత్సవం


పూర్ణాహుతి హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈస్‌గాం శివమల్లన్న దేవాలయం 46వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, స్వస్తివచనం, పుణ్యవచనం, మండపారాధన, నవగ్రహపూజ, అనంతరం వేద పండితులతో మహారుద్రాభిషేకం నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మురళీధర్, ఎమ్మాజీ శారద, సంతోష్, సత్తయ్య, తిరుపతి, ప్రశాంత్‌కుమార్, ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్త, అర్చకులు సంతోష్ శర్మ, రాజేశ్వర్‌రావు, నరహరిశర్మ పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్: ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని మాజీ జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ముందు చేస్తున్న నిరాహార దీక్షకు శనివారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ హక్కు పత్రాలు ఉన్న వారికి భూ పోర్టల్‌లో నమోదు చేసి వారికి బ్యాంకు రుణాలు ఇవ్వలన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు అటవీ భూముల జోలికి అటవీ అధికారులు సాగు చేయకుండ అడ్డుకోవడం సరి కాదని సూచించారు. ఆదివాసీ నాయకులు అర్జు పటేల్, ప్రసాద్,సంతోష్, రవి ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాత్మికతను అలవర్చుకోవాలి

ప్రతి ఒక్కరూ అధ్యాత్మికతను అలవర్చుకోవాలని మాజీ జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని జన్కాపూర్ రామాలయంలో హైదరాబాద్ బృందం శనివారం భక్తిగీతాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు పాల్గొని ఆధ్యాత్మికత ప్రవచనలు బోధించిన దేశాపాండేను అభినందించారు. భక్తులు, భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురి రిమాండ్

కాగజ్‌నగర్‌టౌన్: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురిని శనివారం రిమాండ్ చేసినట్లు పట్టణ ఎస్సై సుధాకర్ తెలిపారు. గతనెల 10న ఆసిఫాబాద్ ఎస్సై ఆకుల ప్రశాంత్ అక్కడి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన పశువుల అక్రమ రవాణా కేసు విషయంలో మూడు ఎద్దులను విడుదల చేయాల్సిందిగా కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఉత్తర్వు కాపీలతో కాగజ్‌నగర్ మండలం కోసినిగోశాలకు వెళ్లారు. గోశాల ఇన్‌చార్జి ఉమాకాంత్‌తో మాట్లాడి మూడు ఎడ్లకు మెయింటనెన్స్ చార్జీలు చెల్లించి ఆసిఫాబాద్ తీసుకెళ్తున్నాడు. పట్టణంలోని జెడ్పీ పాఠశాల వద్ద శివగౌడ్, విజయ్ కుమార్, అరుణ్ లోయ, సాయి పోలీసు వాహనాన్ని అడ్డగించి విధులకు ఆటంకం కలిగించారు. కాగజ్‌నగర్ పట్టణ పోలీసుస్టేషన్‌లోకి ప్రవేశించి అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందికి ఆటంకం కలిగించారని పేర్కొన్నారు. ఈ కేసు విషయంలో 14 మందిపై కేసు నమోదు కాగా ప్రస్తుతం ఐదుగురిని సిర్పూరు కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ చేసి ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

పదవీ విరమణ పొందిన కార్మికులకు సన్మానం


సన్మానిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓసీపీలో శనివారం పదవీ విరమణ పొందిన కార్మికులను ఓసీపీ అధికారులు, తోటి కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు సన్మానించి వీడ్కోలు పలికారు. ఓసీపీలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన వడ్డెపల్లి కనకయ్య, ఇ.సత్యనారాయణ దంపతులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించి బహుమతులు అందజేశారు. ఓసీపీ మేనేజర్ శంకర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు మారం శ్రీనివాస్, శేషశయనరావు, ఓదెలు, సింహాద్రి, ధర్మయ్య, రమేశ్, అశోక్, శంకర్, రాజలింగు పాల్గొన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

రెబ్బెన: మండలంలో ఈనెల 3 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సూర్య ప్రకాశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 3న ధర్మారం, కొమురవెల్లి, 4న ఎడవెల్లి, రంగాపూర్, 5న కైరిగాం, తక్కళ్లపల్లి, 6న కొండపెల్లి, రోళ్లపాడు, 9న రాంపూర్, సీతానగర్ గోవిందాపూర్, 10న నేర్పల్లి, రాజారం, 11న నవేగాం మేడిగూడ, నారాయణపూర్, 12న వంకులం, కిష్టాపూర్, 13న రాళ్లపేట, జక్కులపెల్లి, గూడపల్లి, 16న గంగాపూర్, గోలేటి, 17న పాశిగాం, సోనాపూర్, 18న తుంగెడ, పులికుంట, 19న పోతపెల్లి, నంబాల, 20న రెబ్బెన, ఫకీర్‌పల్లిలో సదస్సులు ఉంటాయని తెలిపారు.

లింగాపూర్: ఈనెల 3న గుమ్నూర్(కే), చోర్‌పల్లి, 4న ఏల్లాపట్టార్, గుమ్నూర్(బి), 5న కొత్తపల్లి, కంచన్‌పల్లి, 6న మామిడిపల్లి, జాముల్‌ధరా, 9న లోద్దిగుడా, వంకామద్ది, 10న లింగాపూర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ పెద్ది రాజు ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ భూ సమస్యలను సదస్సులో పరిష్కరించుకోవాలని సూచించారు.

వాంకిడి: ఈనెల 3 నుంచి 20 వరకు మండల వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ డి.కవిత తలిపారు. గ్రామ పంచాయతీల వారీగా సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు.

కౌటాల: ఈనెల 3 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రమోద్ శనివారం తెలిపారు. భూ భారతి కార్యక్రమంలో రెవెన్యూ సదస్సు కోసం రెండు బృందాలు ఏర్పాటు చేశామని, ఈ నెల 20వ తేదీలోగా రెవెన్యూ సదస్సులు ఉంటాయని తెలిపా రు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఉద యం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సు ఉంటుందన్నారు. 3న వీరవెల్లి, తుమ్మిడిహెట్టిలో, 4న సాండ్‌గాం, గుండాయిపేట్, 5న పార్డీ, శీర్షా, 6న కుంబారీ, ముత్తంపేట్, 9న తాటిపల్లి, ముత్తంపేట్, 10న మొగడ్‌దగడ్, తలోడి, 11న తాటినగర్, గురుడుపేట్, 12న వీర్ధండి, 13న భాలేపల్లి, గురుడుపేట్, 16న కన్నెపల్లి, కౌటాల, 17 కౌటాల, బోదంపల్లి, 18న కనికి, కౌటాల, 19న గుడ్లబోరి, నాగేపల్లి, 20న చందారాం, గుడ్లబోరి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- కోతకు గురైన కల్వర్టులు, వంతెనలు
- దెబ్బతిన్న రహదారులు
- రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బందులు
- నాలుగేళ్లయినా పట్టించుకోని అధికారులు


పూల్సింగ్ తండా వెళ్లేదారిలో కోతకు గురైన కల్వర్టు

లింగాపూర్: గతంలో భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగడంతో మండలంలోని వంతెనలు, కల్వర్టులు కోతకు గురయ్యాయి. వరదలకు సగానికి పైగా కొట్టుకుపోగా, మరికొన్ని ధ్వంసమయ్యాయి. రహదారులు సైతం దెబ్బతిన్నాయి. ఇలా నాలుగేళ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు మరమ్మతుపై పట్టించుకోవడం లేదు. ఈ మార్గంలో ప్రతీరోజు రాకపోకలు సాగించే ప్రజలు, వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. మండలంలోని పంగడిమాదురా, కోలాంగుడా, దంపూర్, కీమానాయక్‌తండా, గేపేరా, లోద్దిగుడా, పూల్సింగ్‌తండా, రామునాయక్‌తండా, గోపాల్‌పూర్, ఏల్లాపటార్ గ్రామాల ప్రజలు నిత్యావసరాల కోసం మండల కేంద్రానికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వారం నుంచి కురుస్తున్న వర్షాలకు రహదారులు ధ్వంసమవుతున్నాయి. కల్వర్టులు, వంతెనలు కోతకు గురికాగా, ప్రమాదం పొంచి ఉండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

భారీ వరదలకు కల్వర్టులు కోతకు..

లింగాపూర్ నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్డుపై నిర్మించిన కల్వర్టులు భారీ వరదల దాటికి కోతకు గురయ్యాయి. మండలకేంద్రం నుంచి మోతీపటార్ వెళ్లే దారిలో కోతకు గురైన కల్వర్టుకు గతంలో అధికారులు రూ.2 లక్షలతో పనులు చేపట్టారు. గతేడాది భారీ వర్షానికి సగానికి పైగా వరదలతో కోతకు గురైంది. జైనూర్ మండలం నుంచి లింగాపూర్ ప్రధాన రహదారిలో దాదాపు 20 కుపైగా బ్రిడ్జిలు, పిట్టగుడా, లింగాపూర్ సమీపంలో గల పెద్ద వాగు పక్కన్న కోతకు గురైన బ్రిడ్జికి నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ఆరు నెలలైనా ఇప్పటికి పనులు పూర్తికాలేదు. రావునూర్, వంకామద్ది, చోర్‌పల్లి, గుమ్నూర్ గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్లపై నిర్మించిన కల్వర్టు, అప్రోచ్‌లు వరదలకు కోతకు గురికాగా, అధికారులు, నాయకులు కొన్నిచోట్ల తాత్కాలికంగా మట్టితో మరమ్మతు చేయించారు. వరదలకు కోతకు గురికావడం, మళ్లీ తాత్కాలిక పనులు చేపట్టడం పరిపాటిగా మారింది. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


వర్షాలకు దెబ్బతిన్న కీమానాయక్‌తండా రోడ్డు

బీటీ రోడ్లు లేక ఇబ్బందులు

లింగాపూర్ మండలం రామునాయక్ తండా వరకు బీటీ సౌకర్యం ఉంది. ఆ పక్కన దాదాపు 20 అనుబంధ గ్రామాలకు బీటీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో వరదలతో కోతకు గురై గుంతలు ఏర్పడుతున్నాయి. గ్రామస్తులు నిత్యం మండల కేంద్రానికి రావాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది.

మరమ్మతు చేయించాలి



వరదల ధాటికి కల్వర్టు, రోడ్లు, అప్రోచ్‌లు కొట్టుకు పోయాయి. నిత్యం పంగడి మాదుర నుంచి పూల్సింగ్ తండా వరకు 10 గ్రామాల ప్రజలు ఈ కల్వర్టుపై నుంచే ప్రయాణాలు సాగిస్తుంటారు. రాత్రివేళ ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో కల్వర్టు పూర్తిగా ధ్వంసమైతే ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా ఉంటాయి. అధికారులు మరమ్మతు చేయించాలి.

– రాథోడ్ అనిల్‌కుమార్, పూల్సింగ్‌తండా

నేడు విద్యుత్ అంతరాయం

వాంకిడి: మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. 33 కేవీ లైన్‌లో మరమ్మతు కారణంగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని మండల ప్రజలు గమనించాలని కోరారు.

ఉత్తర్వులను పునః సమీక్షించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్ణయాన్ని ప్రభుత్వం పునః సమీక్షించుకోవాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చవాన్ కోరారు. లోకమాత అహల్యాబాయి హోల్కర్ జయంతిని శనివారం పట్టణంలోని మాధవ నిలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట ప్రాథమిక పాఠశాలల్లో టీచర్లు లేకుండా చేయడం దారుణమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే ప్రాథమిక పాఠశాలలో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని కోరారు. ధర్మ స్థాపనకు దేశం మొత్తం తిరిగి, స్త్రీ స్వేచ్ఛ కోసం ఎంతో కృషిచేసిన అహల్యాబాయి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. తపస్ ప్రధాన కార్యదర్శి వలభోజు గోపీకృష్ణ, మహిళా అధ్యక్షురాలు కుర్సెంగ జీజాబాయి, నాయకులు గంగాధర్, రాజ్‌కుమార్, కృష్ణసాగర్, సతీశ్, రాజేశ్వర్, శ్రీనివాస్, గంభీర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రెబ్బెన: రెబ్బెన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సూర్య ప్రకాష్‌ను మండలంలోని కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు శనివారం వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. మండల రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు సత్వర పరిష్కారం చూపి న్యాయం చేయాలని కోరారు.